
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024





- మూడు విడతల్లో రూ 346.16 కోట్ల రుణమాఫీ
- అందని వారిపై సర్కారు ప్రత్యేక దృష్టి
- మండలానికి ప్రత్యేక నోడల్ అధికారి నియామకం
- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కొనసాగుతున్న ప్రతిపక్షాల ఆందోళనలు
- సాంకేతిక కారణాలతో మాఫీ కానీ రైతుల ఆందోళనలు

అన్నదాత చుట్టూ రాజకీయం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రూ 2 లక్షల వరకు రుణ మాఫీ అందరికి అందలేదని ప్రతిపక్షాలు అన్నదాతకు అండగా రోడ్డెక్కి ఆందోళనలు మొదలు పెట్టారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణ మాఫీ చేయాలని రుణమాఫీ జరిగే వరకు ఆందోళనలు ఆగవని హెచ్చరించారు. మరోవైపు ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం దృష్టి పెట్టింది. అర్హులందరికీ రుణమాఫీ జరుగుతుందని రైతుపక్షాన ఉన్నామంటూ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. దీంతో రుణమాఫీ ప్రక్రియ రాజకీయాలన్నీ రైతు చుట్టూ మారిపోయాయి.

ప్రతిపక్షాలు ఆందోళనలు ఎలా ఉన్నా జిల్లాలో పూర్తి స్థాయి రైతులకు రుణమాఫీ చేసే విధంగా ప్రతీ మండల కేంద్రంలో రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించారు. మండలాల వారీగా వ్యవసాయ అధికారులు, దరఖాస్తులు స్వీకరించి వాటిని ఆన్‌లైన్ చేసే విధంగా సిద్ధమయ్యారు.

43,770 మంది రైతులకు రుణమాఫీ..

జిల్లాలో మూడు విడతల్లో 43,770 మంది రైతుల ఖాతాల్లో రూ 346.16 కోట్లు జమ చేశారు. జిల్లాలో 65 వేల మంది రుణాలు తీసుకోగా సాంకేతిక కారణాలతో కొన్ని బ్యాంకులకు వివరాలు అందలేదు. దీంతో రుణమాఫీ కాలేదు. జిల్లాలో మొదటి లక్ష రూపాయలు రుణం తీసుకున్న రైతులకు సంబంధించి 23,785 మంది రైతులకు రూ 135.35 కోట్లు, రెండో విడత లక్షన్నర రూపాయల వరకు 12,202 మంది రైతులకు రూ 117.76 కోట్లు, మూడో విడతలో రెండు లక్షల రూపాయల వరకు 7,783 మంది రైతులకు రూ 93.04 కోట్లు మాఫీ అయ్యాయి. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ వారు ఆందోళనలు చేస్తున్నారు.

కొంత మంది రైతులవి ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకాల్లో తేడాలు ఉండడం, పాస్‌బుక్కు, సర్వే నంబర్ సక్రమంగా లేకపోవడం, రేషన్ కార్డుల్లో కుటుంబసభ్యుల గుర్తింపు లేకపోవడంతో రుణమాఫీ జరగలేదు. కొన్ని బ్యాంకుల్లో సాంకేతిక సమస్యలు కూడా రుణమాఫీకి నోచుకోలేదు. రైతులు ఆందోళన చెందుతున్న క్రమంలో ప్రభుత్వం దృష్టిపెట్టింది. రుణమాఫీపై వ్యవసాయ శాఖకు సంబంధించి ఏఈవోలను నోడల్ అధికారులుగా నియమించి ఆయా మండలాల్లో రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాల్లో రుణ మాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో దాదాపు వివిధ కారణాలతో రుణమాఫీ కానీ వారు 16 వేల మంది వరకు ఉంటారని భావిస్తున్నారు.

రుణాల మంజూరులో ఇబ్బందులు...

రుణమాఫీ జరిగిన రైతులు తిరిగి రుణాలు పొందే ప్రక్రియలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని కొన్ని బ్యాంకులు ప్రైవేటు అప్పులు, తీసుకునే వారికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ రైతు రుణాలకు రెండో ప్రాధాన్యం ఇస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఒకే భూమితో సహకార సంఘంతో పాటు వాణిజ్య బ్యాంకుల్లోనూ రుణాలు పొందే వారు. ఈసారి ఒకే భూమికి ఒకే చోట మాత్రమే రుణం తీసుకునే విధంగా ఆధార్‌కార్డు, పాస్‌బుక్కు, సర్వే నంబర్‌ను అనుసంధానం చేస్తున్నారు. సహకార బ్యాంకుల్లో రుణాలకు ష్యూరిటీ కూడా తీసుకుంటున్నారు. బ్యాంకుల వద్ద ఎక్కువ మంది రావడంతో రుణాలకు సంబంధించిన ఫైలింగ్, జాప్యం జరుగుతున్నట్లుగా రైతులు చెబుతున్నారు. రుణాలను సకాలంలో అందించాలని రైతులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిపేటలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

- అవినీతి అక్రమాలపై పిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ
- రెండు రోజులపాటు అన్ని విభాగాల్లో విస్తృత సోదాలు



ఆలయ ఉద్యోగిని విచారిస్తున్న ఏసీబీ అధికారులు

7

రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై డ్రామాలు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

విద్యా సామర్థ్యాల పెంపునకు కృషిచేయాలి: డీఈవో

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 23: విద్యా సామర్థ్యాల పెంపుకోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని భూపతినగర్ ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రమాణాలను పరీక్షించారు. విద్యార్థుల హాజరు శాతంతోపాటు ఎస్ఏఎస్ పరీక్ష నేపథ్యంలో మూడో తరగతి విద్యార్థులపైన ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్‌ను పక్కాగా అమలు చేయాలని కోరారు. పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో



పేషెంట్‌తో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23: కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశాలతో శుక్రవారం జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వసంతకుమార్ సందర్శించారు. ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతున్న వారి వివరాలు పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితలను స్వయంగా పరిశీలించి అవి వైరల్ ఫీవర్లుగా నిర్ధారించారు. వారి ఆరోగ్య స్థితిగతులు కూడా నిలకడగా ఉన్నట్లు నిర్ధారించారు. ఆయన వెంట డీసీహెచ్ఎస్ డాక్టర్ పెంచలయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాయిం జాహ, డాక్టర్ సోని, సిబ్బంది ఉన్నారు.

దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని దుర్గమ్మ ఆలయంలో స్థానికులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు, పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ - నేరెళ్ల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

తంగళ్లపల్లి, ఆగస్టు 23: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని వైద్యులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్లు, ఓపీ, కాన్పుల రిజిస్టర్, వ్యాక్సిన్ తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఓపీకొ ఎంత మంది వచ్చారు? పీహెచ్‌సీలో ఈ నెలలో ఇప్పటిదాకా ప్రసవాలు ఎన్ని చేశారు? కుక్క కాటు, డెంగ్యూ టెస్ట్ కిట్లపై ఆరా తీశారు. శుక్రవారం 15 మంది ఓపీకి వచ్చారని వారిలో ఇద్దరికి రక్త పరీక్షలు చేశామని, ఈ నెలలో 19 కాన్పుల లక్ష్యం కాగా, పది పూర్తి చేశామని, టెస్ట్ కిట్లు, వ్యాక్సిన్‌లు ఉన్నాయని డాక్టర్ రేఖ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ వైద్యసేవలపై అవగాహన కల్పించాలని, ఇక్కడే అన్ని పరీక్షలు, వైద్యం అందించాలని సూచించారు. హాస్పిటల్ ఆవరణలో స్వచ్ఛత, పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియాపై ప్రత్యేక దృష్టి పెట్టి టెస్ట్‌లు, మెడిసిన్ అందించాలని సూచించారు. హాస్పిటల్‌కు కావాల్సిన కిట్లు, మందులు ఏమైనా అవసరం ఉంటే సమాచారం ఇవ్వాలని ఆదేశించారు.



పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

● విద్యార్థులతో నిత్యం ప్రాక్టీసు చేయించాలి...

విద్యార్థులతో నిత్యం చదవడం, రాయడం, ప్రశ్నలకు జవాబులు చెప్పేలా ప్రాక్టీసు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయం ఆవరణ, వంట సామగ్రి స్టోర్ రూం, కిచెన్ పరిశీలించారు. మెనూ ప్రకారం ఏ ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించి, పాఠాలు బోధించారు. మ్యాథ్స్, ఇంగ్లీష్, బయో సైన్స్ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేశారు. టీచర్లు పాఠాలు బోధిస్తున్నప్పుడే విద్యార్థులు నోట్స్ రాసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీజీసీఆర్‌టీ సంతోషిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజన్నకు శ్రావణ శుక్రవారం మొక్కులు

- కోడెమొక్కుకు రెండు గంటల సమయం

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున భక్తులు కల్యాణ మండపంలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. క్యూలైన్‌లో భక్తులు సుమారు రెండు గంటలపాటు నిరీక్షించి కోడెమొక్కును చెల్లించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాలతో ఆలయ ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, సూపరిండెంట్‌లు తిరుపతిరావు, అశోక్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● అమ్మవారి ఆలయాల్లో మహిళల సందడి..

శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరీ అమ్మవారికి ఉదయం, సాయంత్రం చతుష్షష్ఠి ఉపచారములతో విశేషపూజలు నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, అర్చన, శ్రీమహాలక్ష్మి హోమము చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు నుంచి శ్రీమహాలక్ష్మి అమ్మవారికి షోడశోపచార పూజలు చేపట్టారు. కాగా మహిళలు మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుని ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రేవతి నక్షత్రం సందర్భంగా లక్ష్మీఅనంత పద్మనాభ స్వామి వారికి ఉదయం 6.30 గంటలకు పంచోపనిషత్ ద్వారా అభిషేకము, సాయంత్రం సదస్యము అర్చకులు ఘనంగా నిర్వహించారు.





రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, మహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం పోసేందుకు బారులుదీరిన మహిళలు

కల్వర్టుపై గుంతలు

వాహనదారులకు ఇబ్బందులు

పట్టించుకోని అధికారులు

గంభీరావుపేట, ఆగస్టు 23: మండలంలోని నర్మాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో ముస్తాబాద్-కామారెడ్డి ప్రధాన రహ దారి కాళేశ్వరం కెనాల్‌పై నిర్మించిన కల్వర్టు ప్రమాద కరంగా మారింది. కాళేశ్వరం కెనాల్ కల్వర్టు నిర్మాణం సరిగా లేకపోవడంతో వర్షాకాలం నీరు నిలిచి ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కల్వర్టుపై వర్షపు నీరు నిలువతో గుంతలు పడ్డాయి. వాహనాలు దగ్గరికి వచ్చే వరకు కూడా గుంతలు కనిపించక పోవడంతో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపించారు. ఐదురోజుల క్రితం కోలమద్ది గ్రామానికి చెందిన ఓ జంట కామారెడ్డి జిల్లా వేలుగొండ గ్రామానికి తమ్ముడికి రాఖీ కట్టడానికి వెళ్తుండగా కల్వర్టుపై ఏర్పడ్డ గుంతలు కనపడకపోవడంతో బైక్ పైనుంచి కింద పడి పోయారు. దీంతో ఆ జంటకు గాయాలయ్యాయి. ఇదే మార్గం గుండా రెండు రోజుల క్రితం కూడా ఒకరు ద్విచక్ర వాహనంపై వెళ్తూ కిందపడి గాయాలపాలయ్యారు. ప్రతి నిత్యం ఎవరో ఒకరు ఈ గుంతలు కానరాక పడిగాయాల పాలవుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టుకు ఏర్పడిన గుంతలు పూడ్చి వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



కల్వర్టుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యం

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 23: విద్యార్థినులకు అధిక భద్రతను కల్పించాలనే లక్ష్యంతో చైతన్య పేరుతో పోక్సో చట్టం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామని వీటిని ప్రతి ఒక్క విద్యార్థినీ సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై బాలబాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, శిక్షల గురించి, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్‌ల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్‌శాఖ విద్యార్థినుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పోక్సో యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పరచడానికి పోక్సోపై చైతన్యం పేరుతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మైనర్ బాలికలు, చిన్నారులపై నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. తద్వారా తమ విలువైన జీవితం అంతా జైల్లోనే మగ్గిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చిన్నారులపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని హెచ్చరించారు. విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. ఎవరైనా వేధిస్తే జిల్లా షీ టీమ్ నంబర్ 8712656425కు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, జిల్లా సంక్షేమ అధికారి పి లక్ష్మీరాజం, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అంజయ్య, షీ టీం ఏఎస్ఐ ప్రమీల, షీ టీం సిబ్బంది రమాదేవి, ప్రియాంక, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.



ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం మనోహరచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 20 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. అపరాధ రుసుంతో సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు 3 వరకు ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. పదో తరగతిలో ప్రవేశాలకు గతంలో చదివిన తరగతి ధ్రువీకరణ పత్రం లేదా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి సర్టిఫికెట్, కులం, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు కలిగిన రెండు జిరాక్స్ సెట్లతో పాఠశాలలో సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తివివరాలకు 9849666073, 8008002293 సంప్రదించాలని హెచ్ఎం మనోహరచారి కోరారు.

చట్టం ముందు అందరూ సమానులే

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి

వేములవాడ, ఆగస్టు 23: చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసినవారికి తప్పకుండా శిక్ష పడుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతరుల పట్ల చెడుగా ప్రవర్తించరాదని, అందరికీ సమాన హక్కులు ఉంటాయని చెప్పారు. మైనర్ బాలికలు, చిన్నారుల పట్ల నేరాలకు పాల్పడే వారికి పోక్సో చట్టం ప్రకారం జీవిత ఖైదీ వంటి శిక్షలు పడే అవకాశం ఉందని వివరించారు. చట్టం ముందు అందరూ సమానమేనని తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని అన్నారు. అంది వస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు జీవితంలో చక్కటి లక్ష్యాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కటకం అంజయ్య, పట్టణ సీఐ వీరప్రసాద్, హెచ్ఎం రాజరత్నం, షీ టీం ఏఎస్ఐ ప్రమీల తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలనే లక్ష్యంతో పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో శనివారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థినులు బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలికలు ఎక్కడైనా వేధింపులకు గురయితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగితే 100కు ఫోన్‌చేయాలన్నారు. పోలీసులు నిరంతరం రక్షణ కోసమే పనిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

మాలల ఐక్య పోరాట సమితి కార్యవర్గం

కోనరావుపేట, ఆగస్టు 23: కోనరావుపేట మండల మాలల ఐక్య పోరాట సమితి నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆవరణలో జరిగింది. అధ్యక్షుడిగా మాందాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, మాదాసు భూమయ్య, ప్రధాన కార్యదర్శిగా పరశురాములు, కోశాధికారి ఇరవెల్లి ప్రసాద్, సలహాదారులుగా కోలేరు చంద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు నాలుక సత్యం, యాదగిరి సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గొల్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని గోవిందుపల్లి గ్రామంలో ఈ నెల 21న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక (16) పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఎస్సై సతీష్ కుమార్ తెలిపిన కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలిక జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. బాలికను తల్లిదండ్రులు కళాశాల వసతి గృహంలో ఉంచి చదివించేందుకు సిద్ధమయ్యారు. హాస్టల్‌లో ఉండేందుకు ఇష్టపడని బాలిక ఇంట్లో నుంచి చదువుకుంటానని తల్లిదండ్రులకు తెలిపింది. అందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాలిక ఈనెల 21న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించగా మూడుల రోజుల అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

కథలాపూర్, ఆగస్టు 23: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం కలికోటలో ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసి వృధాగా ఎందుకు ఖర్చు చేశా వంటూ తండ్రి మందలించినందుకు యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...కలికోటకు చెందిన దరావత్ చరణ్ (16) ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం చదివి చదువు మానేసి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తండ్రి బాబు నాయక్ ఉపాధి పనులకు వెళ్లిన డబ్బులు ఖాతాలో జమ కాగా వెయ్యి రూపాయలు ఫోన్‌పే నుంచి డ్రా చేసుకుని చరణ్ ఖర్చు చేశాడు. దీంతో డబ్బులు ఎందుకు వృధాగా ఖర్చు చేశావని చరణ్‌ను మందలించడంతో మనస్థాపానికి గురయ్యాడు. క్షణికావేశంతో ఊరి చివరన ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి బాబు నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నవీన్ తెలిపారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,376 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. నంది పంప్‌హౌస్ నుంచి మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 419 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.302 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 23: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 18 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీలోకి 3,872 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 3,872 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు..

బోయినపల్లి, ఆగస్టు 23: మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 6,300 క్యూసెక్కులు, మూలవాగు, మానేరు వాగు ద్వారా 110 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 313.71 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.78 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా శనివారం నుంచి ఎల్ఎండీ పాజెక్టుకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువనున్న మానేరు వాగులో రైతుల మోటర్లు తొలగించుకోవాలని సూచించారు. వాగు పరిసర ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు.

ఉపాధి నైపుణ్య శిక్షణ దరఖాస్తులకు నేడు తుది గడువు

గణేశ్‌నగర్, ఆగస్టు 23: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎల్జీ హెప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకాలం పూర్తయిన తరువాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉండాలని, వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

















కొడుకును గల్ఫ్ నుంచి రప్పించాలి

- విదేశాంగ పీవోఈ అధికారికి తల్లి వినతి



పీవోఈకి విజ్ఞప్తి చేస్తున్న కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్, ఆగస్టు 23: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి అనారోగ్యంతో బాధప డుతున్న తన కొడుకును స్వగామానికి రప్పించే విధంగా చర్యలు తీ సుకోవాలని కోరుతూ ఓ తల్లి హైదరాబాదులోని విదేశాంగ పీవోఈ అధికా రికి వినతిపత్రం అందించింది. గల్ఫ్ మెడికల్ సెంటర్ నిర్లక్ష్యంపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేసింది. మండలంలోని సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాదులోని ఎస్కే మెడికల్ సెంటర్ (గల్ఫ్ దేశం గుర్తించిన వైద్య కేంద్రం)లో వైద్య పరీ క్ష చేయించుకుని జూలై 11న ఉద్యోగ విసాపై సౌదీ అరేబియాలోని అల్ - బాద్ తాబూక్‌కు వెళ్లి ఓ కంపనీలో సూపర్ వైజర్‌గా చేరినట్లు తల్లి లక్ష్మి ఫిర్యాదులో పేర్కొంది. వెళ్లే ముందు చంద్రశేఖర్‌కు ఫిట్‌నెస్ కోసం ఇచ్చిన టీకా వికటించిందని తన కుమారుడి చేతికి తీవ్ర గాయం అయి ఆరోగ్యం క్షీణి స్తోందని కంపెనీ యజమానుల దృష్టికి తీసుకెళ్లినా స్పందిం చడం లేదని వాపోయింది. హైదరాబాదులోని మెడికల్ సెంటర్ నిర్లక్షంగా వ్యవహరించడం వల్లనే తన కొడుకు దేశం కాని దేశంలో ఇబ్బందులు పడుతున్నాడని తెలిపింది. గల్ఫ్ జేఏసీ కన్వీనర్ రవి గౌడ్ సహకారంతో చంద్రశేఖర్ సహకారంతో అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. తన కుమారుడు స్వ గామానికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

హత్యకు దారి తీసిన వివాదం

- కొలనూరు హత్య కేసులో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ గజ్జి కృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్, ఆగస్టు 23: చిన్న మాటతో పెరిగిన వివాదం చివరకు హత్యకు దారి తీసిందని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ అన్నారు. మాజీ హోంగార్డు మాటూరి విజయ్‌ను హత్య చేసిన గోదారిఖనికి చెందిన రౌడీషీటర్ పులిపాక శ్రీకాంత్ అలియాస్ పల్లె శ్రీకాంత్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్టు తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ కొలనూరు హత్య కేసు ఉదంతాన్ని వివరించారు. విజయ్, శ్రీకాంత్ కుటుంబాల మధ్య ఇతర భూవివాదాలున్నాయి. ఈనెల 21న రాత్రి పది గంటలకు ఓ మద్యం దుకాణం వద్ద మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్‌ల మధ్య ఘర్షణ జరిగింది. కేవలం మూత్రశాలలు సరిగా లేవన్నందుకే మాటూరి విజయ్, పులిపాక శ్రీకాంత్ మధ్య మాటామాటా పెరిగి, ఇద్దరు కొట్టుకున్నారు. విజయ్‌ను తోసివేయడంతో పక్కనే ఉన్న ఓపెన్ డ్రైనేజీలో పడి తలకు తీవ్ర గాయమైంది. అయినా మళ్లీ లేపి తన వద్ద ఉంచుకున్న కత్తి తీసి విజయ్‌ను పొడిచి శ్రీకాంత్ పారిపో యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న విజయ్‌ను ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లలో ఉండగానే ప్రాణాలు కోల్పోయాడు. హంతకుడు పులిపాక శ్రీకాంత్‌పై గోదావరిఖని పోలీస్ స్టేషన్‌లో హత్య కేసుతోపాటు పలు కేసులు నమోదై ఉన్నాయని, గోదావరిఖనిలో రౌడీషీటర్ మంథని సుమన్‌తో తిరిగి వారితో కలిసి హత్యకు పాల్పడ్డాడని, హత్య కేసులో జైలుకు కూడా వెళ్లివచ్చాడని ఏసీపీ తెలిపారు. పలు నేరాలు, కేసుల నమోదు నేపథ్యంలో 14 జూలై 2020న గోదావ రిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శ్రీకాంత్‌పై రౌడీషీట్ ఓపెన్ చేశారని ఏసీపీ వివరిం చారు. హత్య కేసులో ఉన్న శ్రీకాంత్ అప్పటినుంచి తనను కూడా ఎవ రైనా ఏమైనా చేస్తారని ముం దుజాగ్రత్తగా తన వద్ద కత్తి ఉంచుకుని తిరిగేవాడని, అదే భయంతో కొంతకాలంగా తన అమ్మమ్మ ఊరైన కొలనూర్‌లో ఉంటున్నాడని, ఈ నేపథ్యంలో చిన్న మాట పట్టింపుతో మాటూరి విజయ్‌ను హత్య చేశాడన్నారు. అప్పటినుంచి ఎవరికీ దొరకకుండా గోదావరిఖని, పెద్దపల్లి రైల్వే స్టేషన్లు, తదితర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నాడని, ఇక ఇక్కడ ఉంటే పోలీసులకు దొరుకుతానన్న భయంతో శుక్రవారం కొలనూర్‌లోని తన ఇంటికి వచ్చి డబ్బులు తీసుకుని హైదరాబాద్ వెళదామనే ప్రయత్నంలో ఉన్న పులిపాక శ్రీకాంత్ గురించి తమకు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై సిబ్బంది ఉదయం శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని, రక్తం మరకలు అంటిన దుస్తులను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు సుల్తానాబాద్ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

● సక్రమంగా విధులకు హాజరుకమ్మనందుకు..

విధులకు సక్రమంగా హాజరుకాని ఏఎన్ఎంను సక్రమంగా విధులకు హాజరుకావాలని అన్నందుకు ప్రభుత్వ డాక్టర్ హత్యకు పథకం వేశారని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న మహేందర్ విధులు ముగించుకుని కారులో పెద్దపల్లికి వెళుతుండగా మార్గమధ్యలో ఏడుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్‌లు, కర్రలతో దాడి చేయగా డాక్టర్‌కు తీవ్ర గాయలయ్యాయి. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారించగా పందిళ్ల గ్రామంలో ఏఎన్ఎంగా పని చేస్తున్న కాసిపాక విజయ కారణమని తేలింది. ఏఎన్ఎం విధులకు సక్రమంగా రాకపోగా తనకు పరిచయం ఉన్న ఎన్నం కృష్ణతో తిరిగేది. ఈ నేపథ్యంలో డాక్టర్ మహేందర్ మెమో జారీ చేస్తానని చెప్పడంతో విజయ తనకు సన్నిహితుడైన కృష్ణకు చెప్పింది. అన్నం కృష్ణ, విజయ, మరికొందరు కలిసి డాక్టర్‌ను హత్య చేయడానికి పూనుకున్నారు. బాధితుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎన్ఎం విజయతో పాటు అన్నం కృష్ణ, షేర్ల బాలాజీ, కోరడ్ల రఘువర్ధన్‌రెడ్డి, మమిడాల లావణ్‌కుమార్, హిమాయత్, దారంగుల సాగర్, బొక్కల ఆదిత్యలపై కేసు నమోదు చేసి, ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. కీలక నిందితులు విజయతోపాటు అన్నం కృష్ణ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారని, ఈ నేపథ్యంలో తాము గంగారం చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండా పట్టుబడ్డారని చెప్పారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసినట్లు శుక్రవారం సుల్తానాబాద్ కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, సుల్తానాబాద్, పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐలు శ్రావణ్ కుమార్, ఓంకార్ యాదవ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీలు

» అవినీతి అక్రమాలపై ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ » పలు విభాగాల్లో ఫైళ్లను సీజ్ చేసి తీసుకెళ్లిన అధికారులు



రాజన్న ఆలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గురువారం ఉదయం రాజన్న ఆలయానికి చేరుకున్న ఏసీబీ, మెట్రాలజీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఒకే సారి పలు విభాగాల్లో సోదాలను రాత్రి 8 గంటల వరకు చేపట్టారు. శుక్రవారం ఉదయం సైతం సోదాలు కొనసాగించారు. రాజన్న ఆలయ ప్రధాన విభాగాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని అందిన పిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు పలు శాఖల అధికారులతో సోదాలు చేశారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆలయంలోని అన్నదాన సత్రం, లడ్డుల తయారీ విభాగం, గోదాం, సానిటేషన్ విభాగం, ఆడిట్ తదితర విభాగాల్లో సోదాలు నిర్వహించి ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. ఆడిట్, తూనికలు కొలతలు శాఖల అధికారులతో కలిసి సమగ్ర విచారణ చేపట్టారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టడంతో రాజన్న ఆలయ ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఏసీబీ అధికారుల విచారణ ఎంత మంది అధికారుల మెడకు చుట్టుకుంటోందోనని ఆలయ ఉద్యోగుల్లో జోరుగా చర్చజరుగుతుంది. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను ప్రభుత్వానికి అందిస్తామని ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో అక్రమాలు, అవినీతి జరుగుతున్నట్లు తమకు వచ్చిన ఫిర్యాదుతో తనిఖీలు చేశామని అన్నారు. పలు విభాగాల్లో సమగ్రంగా విచారణ చేపడుతున్నామని, విచారణ పూర్తి అయిన వెంటనే నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. ఆయన వెంట ఏసీబీ సీఐలు తిరుపతి, కృష్ణకుమార్ ఆడిట్, తూకలు, కొలతల అధికారులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఇద్దరి రిమాండ్

తిమ్మాపూర్, ఆగస్టు 23: మండలంలోని ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై ఎల్ఎండీ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఎండీ కాలనీలోని జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధుల నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల జీతాలు సుమారు 10లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు దీనికి అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి తిరుమలతో పాటు ఆమె భర్త కెరాజ్‌కుమార్‌ను బాధ్యులని ఈ ఏడాది ఏప్రిల్ 5న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు చాలాన్లు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని వివరించారు. అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న ఎల్ఎండీ పోలీసులు 420కేసుతో పాటు పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ మేరకు శుక్రవారం జి తిరుమలతో పాటు రాజ్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

రూ.4.92లక్షల మాయం.. కేసు నమోదు

మానకొండూర్, ఆగస్టు 23: మానకొండూర్ మండలంలోని ఊటూర్ గ్రామానికి చెందిన నెమ్మది ప్రశాంత్ అనే వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా శుక్రవారం లింకు వచ్చింది. దీంతో ప్రశాంత్ ఆ లింకును ఓపెన్ చేయడంతో అతని బ్యాంకు ఖాతా నుంచి నాలుగు లక్షల 92వేలు మాయం అయ్యాయి. కాగా బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ సూచించారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

మంథని, ఆగస్టు 23: స్థానిక అంబేద్కర్ చౌక్ సమీపంలో మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న చకిలం కృష్ణమూర్తి అండ్ సన్స్ ఫర్టిలైజర్ షాపులో గురువారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. షాపు ఓనర్ చకిలం శ్రీనివాస్ రోజువారీగా రాత్రి షాపునకు తాళం వేసుకొని ఇంటి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచిచూడగా తన షాపులో చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. షాపు వెనుక భాగంలో ఉన్న కిటికీ స్క్రూలను దొంగ తొలగించి షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు, సీసీ కెమెరాల మానిటర్‌ను ఎత్తుకొని వెళ్లాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఈ మేరకు బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: విద్యుత్ చౌర్యం చేస్తూ ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీసులకు పట్టుబడిన కేసులో హుజురాబాద్ మండలం సిర్సపల్లి గ్రామానికి చెందిన దొంత మైసయ్యకు 2,817 రూపాయల జరిమానా లేదా ఒక నెల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కరీంనగర్ జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ జడ్జి డి వెంకటేష్ తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ ఎండీ షాదుల్లా బాబా తెలిపారు. నిందితుడిపై 2019 సంవత్సరం జనవరి 31న, అదే సంవత్సరం ఆగస్టు 20న విద్యుత్ చౌర్యం కేసులు నమోదయ్యాయని తెలిపారు.

అంబులెన్స్ బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు



బోల్తాపడిన అంబులెన్స్

తంగళ్లపల్లి, ఆగస్టు 23: మండలంలోని బద్దెనపల్లి శివారులో ప్రమాదవశాత్తు అంబులెన్స్ బోల్తా పడటంతో ఒకరు తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వేములవాడ పట్టణానికి చెందిన శేఖర్ కుడి కాలు విరగడంతో హైదరాబాదులో వైద్య చికిత్స పొంది అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో అంబులెన్స్ బద్దెనపల్లి శివారులో ప్రమాదానికి గురై బోల్తా పడింది. దీంతో శేఖర్ ఎడమ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. అంబులెన్స్ డ్రైవర్ శివ స్వల్పంగా గాయపడ్డాడు. కాలు విరిగి చికిత్స చేయించుకొని మరో 15 నిమిషాల్లో శేఖర్ ఇంటికి చేరుకుంటాడు అనుకుంటున్న క్రమంలో దురదృష్టం వెంటాడి ప్రమాదంలో మరో కాలు విరిగి తీవ్రంగా గాయపడడం పలువురిని కలిచి వేసింది.

పోలీసుల పేరుతో చోరీ

- తులంన్నర బంగారు ఆభరణాలు అపహరణ



సీసీ పుటేజీలో పోలీసులు సేకరించిన చిత్రం

కోరుట్ల, ఆగస్టు 23: తాము పోలీసులం అంటూ కోరుట్ల పట్టణంలో శుక్రవారం ఓ వ్యక్తి వద్ద నుంచి తులంన్నర బంగారు ఆభరణాలను ముగ్గురు వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన మిట్టపల్లి భూమరాజం శుక్రవారం ఉదయం కూరగాయలు కొనేందుకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. ఇందిరా రోడ్డు నుంచి వెళుతున్న భూమరాజంను గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి అతడి ద్విచక్ర వాహనానికి అడ్డంగా పెట్టాడు. ఆ వెంటనే మరో వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమంటూ భూమరాజంతో మాట కలిపారు. గంజాయి తరలిస్తున్నావా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. వెంటనే అక్కడున్న మరో వ్యక్తి భయపడినట్లు నటించి తన మెడలో ఉన్న బంగారు చైన్‌ను సదరు వ్యక్తులకు అప్పజెప్పాడు. దీంతో సదరు వ్యక్తులు భూమరాజంను కూడా తన మెడలో ఉన్న బంగారం ఇవ్వు అంటూ బెదిరించారు. ఇంతలోనే సదరు వ్యక్తులు భూమరాజం చేతిపై స్ప్రే చేసి మెడలో ఉన్న చైన్‌తో పాటు చేతికి ఉన్న ఉంగరాన్ని తీసుకుని ఆ ముగ్గురూ కలిపి అక్కడి నుంచి పారిపోయారు. కాసేపటికి తెరుకున్న బాధితుడు బంగారు చోరీకి గురైనట్లు గుర్తించి విషయం వెంటనే పోలీసులకు తెలిపారు. ఎస్ఐ శ్రీకాంత్, 2వ ఎస్ఐ శ్వేత తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులు ఇచ్చిన సమాచారంతో తనిఖీ నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించి అనుమానితుల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూమరాజం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23: మూడు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష విధించారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం అయన మాట్లాడుతూ మెమోరీ కార్డులో నీలిచిత్రాలు నింపి అమ్మిన సెల్ పాయింట్ యజమాని ఆడెపు రాజుకు రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానాను సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ఎ ప్రవీణ్ విధించారని అయన తెలిపారు. సెల్ పాయింట్ యజమాని సిరిసిల్ల పట్టణం సుందరయ్య నగర్‌కు చెందిన ఆడెపు రాజు అనే వ్యక్తి మొబైల్ ఫోన్‌లో రీచార్జితో పాటు, అధిక లాభాలు ఆర్జించాలనే దురుద్దేశంతో తన యొక్క కంప్యుటర్‌లో నీలి చిత్రాల వీడియోలు డౌన్లోడ్ చేసి తన వద్దకు వచ్చే కస్టమర్లకు మొబైల్ ఫోన్ మెమోరీ కార్డుల్లో నింపి డబ్బులు సంపాదించాడన్నారు.హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల బాలకిషన్, రాగులు దేవయ్య , రాగుల రఘు అనే ముగ్గురికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.100 జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. మరో హత్యాయత్నం కేసులో రుద్రంగి గ్రామానికి చెందిన రాగుల వెంకటేష్, రాగుల కొండయ్య , రాగుల నరసయ్య, మర్రి తిరుపతి అనే నలుగురిపై నేరం రుజువు కావడంతో ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి 1000 రూపాయల జరిమానా విధిస్తు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ తీర్పు చెప్పారన్నారు. మూడు కేసుల్లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పీపీలు గడ్డం లక్ష్మణ్, టి పవన్, చెలుముల సందీప్, ఎస్ఐ రవీంద్రనాయుడు, కోర్ట్ కానిస్టేబుల్‌లు నరేష్, శ్రీనివాస్, కానిస్టేబుల్స్ మధుసూదన్, సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, రుద్రంగి ఎస్ఐ అశోక్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు.

బస్‌స్టేషన్‌లో ల్యాప్‌టాప్ మరిచిపోయిన ప్రయాణికుడు



ల్యాప్‌టాప్‌ను డిపో అధికారులకు అప్పగిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, ఆగస్టు 23: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గుర్తుతెలియని ఒక ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయాడు. బస్‌స్టేషన్‌లోని హోటల్‌లో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను గుర్తించిన ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే ఆ ల్యాప్ టాప్‌ను ఆర్టీసీ డిపో-1 క్లర్క్‌కు అందించారు. హెచ్‌పీ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్ ఖరీదు లక్ష రూపాయల వరకు ఉంటుందని అంచనా. కార్యక్రమంలో ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్ఐ ఎం లక్‌పతి, కానిస్టేబుల్ రమణ, నారాయణ పాల్గొన్నారు.

అధికారుల తనిఖీలు

చొప్పదండి, ఆగస్టు 23: సాంఘిక సంక్షేమ పాఠశాలల తనిఖీలో భాగంగా శుక్రవారం చొప్పదండిలోని జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల, రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సన్నబియ్యం నాణ్యత, ఆహారాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం రజనీకాంత్ తనిఖీ చేశారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ సిబ్బంది మజారుద్దీన్, సాయికుమార్ ,ప్రధనోపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యాకర్తలు పాల్గొన్నారు.



ధర్మపురి మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురిలో భక్తుల రద్దీ

- ఆలయాల్లో అమ్మవారలకు కుంకుమ పూజలు

ధర్మపురి, ఆగస్టు 23: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో మూడవ శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. మహిళలు కుంకుమ పూజలు, ఉద్యాపన పూజలు జరిపారు. అనేక మంది భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాంకిషన్ అందంగా అలంకరణ చేసిన అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా లక్ష్మీ హవనం నిర్వహించారు.

పాకాలవాణికుంటకు బుంగ

-తాత్కాలిక మరమ్మతులు చేసిన అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 23: మండలంలోని రేపాక గ్రామంలోని పాకాలవాణికుంటకు శుక్రవారం బుంగపడింది. ఇటీవల కురిసిన వర్షాలతో పాకాలవానికుంట నిండింది. మత్తడి సమీపంలోని కట్టకు బుంగపడటంతో నీరు వృధాగా వెళ్లిపోవడాన్ని చూసిన మాజీ ఎంపీటీసీ కాత సుమలతమల్లేశం సమస్యను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు డీఈ శ్రీనివాస్, ఏఈ రాధిక కుంటవద్దకు చేరుకొని ఎక్స్‌కవేటర్ సహాయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.



పాకాలవాణికుంట నుంచి వెళుతున్న నీరు

ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దు



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

గంగాధర, ఆగస్టు 23: ముంపు గ్రామాల రైతులు ఆందోళన చెందొద్దని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. గంగాధర మండలం గర్షకుర్తిలో శుక్రవారం ముంపు గ్రామాల రైతులతో ఆర్డీవో గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం లింకు ప్రాజెక్టు ఎత్తిపోతల్లో 11 టీఎంసీ కాలువ నుంచి డి4 కాలువ కింద గర్షకుర్తి, ఉప్పరమల్యాల గ్రామాల రైతులకు చెందిన 17 ఎకరాలు పోతుందన్నారు. వ్యవసాయ భూమితో పాటు చెట్లు, బావులు, ఇతర వ్యవసాయ పైపులైన్లు తప్పి పోయిన రైతులు నేరుగా ఫిర్యాదు చేయాలన్నారు. తప్పిపోయిన భూములు, బావులు, చెట్లు తదితరాలకు ప్రభుత్వ పరంగా పరిహారం అందిస్తామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమానికి రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, డీఈ విష్ణు ప్రసాద్, గర్షకుర్తి, ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 23: శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వంకాయగూడెం గ్రామానికి చెందిన చల్ల కనకయ్య శుక్రవారం రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. కనుకయ్య తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం తెలుసుకున్న పెట్రోలింగ్ పోలీసులు 108కు సమాచారం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 23: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామానికి ఎర్ర శ్రావ్యను భర్త అశోక్‌తో పాటు అత్తా, మామ కొంత కాలంగా అదనపు కట్నం తీసుకురావలని వేధిస్తున్నారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్తతో పాటు అత్త రాజేశ్వరి, మామ సారయ్య నాలుగు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు పిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్ స్పెక్టర్ రవి తెలిపారు.

వేములవాడ రాజన్నకు ఉడకని నైవేద్యం

- తప్పతాగి విధులకు హాజరైన వంట మనిషి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి ఉడకని నైవేద్యాన్ని శుక్రవారం సమర్పించారు. స్వామి వారికి నిత్యం ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన నివేదన అరగంట ఆలస్యమైంది. స్వామి వారి నివేదన సమయంలో నైవేద్యం ఏర్పాటు చేసే వ్యక్తి తప్పతాగి విధులకు హాజరుకావడంతో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. ఆగమేఘాల మీద సదరు వ్యక్తి వంటకాలు చేయడంతో మాడిపోయాయి. దీంతో చేసేదేమీ లేక ఉడికీ ఉడకని నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు23: ఎస్‌బీఐ ఆర్‌సెటీలో ఆగస్టు 30వ తేదీ నుంచి పురుషులకు రిఫ్రిజరేషన్ అండ్ ఏయిర్‌కండిషనర్‌లో 30రోజుల పాటు ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాల వారు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు 9849411002, 798115 1653 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గంజాయి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి: ఎస్పీ



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 23: గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో గంజాయి, మాధకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రచార రథం పట్టణ పరిధిలో ప్రధాన కూడళ్ల, వీధుల వెంబడి తిరుగుతూ గంజాయి, మాధకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ వినూత్న కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తుందన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు,నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుదన్నారు. జిల్లాలో విస్తృతంగా గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్ట్‌లు చేస్తూ వారిపై కేసులు నమోదు చేస్తున్నామని, గతంలో గంజాయి కేసులలో నిందితులుగా ఉన్నవారికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఏర్పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో గంజాయి సాగు, విక్రయాలు చేసిన వారి సమాచారం 8712656392 నంబర్‌కి తెలియజేయాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదని, గంజాయికి అలవాటు పడిన వారిని పోలీస్ డి ఆడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ కోసం 8712656392 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చేయూత అందించాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 23: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందించడంతోపాటు కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బోర్డులో కార్మికుల ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం కొనసాగించాలని సీఐటీయూ బిల్డింగ్ అదార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనంలో శుక్రవారం సీఐటీయూ బిల్డింగ్ అదార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి మాట్లాడుతూ అనేక పోరాటాలతో సాధించుకున్న కార్మికుల సంక్షేమ బోర్డును అధికారులు నిర్లక్ష్యం వల్ల బోర్డుకు రావాల్సిన నిధులు పక్కదారి పడుతున్నాయని అన్నారు. కార్మికులకు రావాల్సిన క్లైయిమ్స్‌లను సకాలంలో చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పుడు బోర్డులోని ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని ప్రభుత్వం నుంచి తొలగించి ప్రైవేటు సంస్థకు అప్పగిస్తామని ప్రకటించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకొని కార్మికుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని బోర్డులోనే ఇన్సరెన్స్‌ను కొనసాగించాలని లేని పక్షంలో ఈ నెల 28న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ప్రకటించారు. అయిన ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో ఆందోళనలు, పోరాటాలు చేపడుతామన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికసంఘం అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి, జిల్లా ఉపాధ్యక్షుడు గీసా బిక్షపతి, సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్, గుంటుక నరేందర్, సావనపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాలకు పక్కా భవనాలను నిర్మించాలి

సిరిసిల్ల రూరల్, అగస్టు 23: ప్రభుత్వ వసతి గృహాలకు పక్కా భవనాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించడంతోపాటు ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిలో వసతులను కల్పించాలని బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలోఉన్న సాంఘిక సంక్షేమశాఖ బీసీ వసతిగృహన్ని శుక్రవారం బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులు సందర్శించి విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాలతోపాటు విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న వసతిగృహాల్లో సరైన మౌలిక వసతులు కల్పించాలని మోను ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు అల్పాహారాన్ని అందించాలన్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేష్‌నవీన్, తిరుపతి, సాయి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

గంభీరావుపేట ఆగస్టు 23: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గంభీరావుపేట ఆధ్వర్యంలో లయన్స్ కరీంనగర్ డాక్టర్ మడేకర్ చారిటబుల్ ఐ హాస్పిటల్ ఛైర్మన్ కొండా వేణుమూర్తి వైస్ ఛైర్మన్ చిదుర సురేష్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో నుండి 13 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం కరీంనగర్ రేకుర్తి ఐ హాస్పిటల్ కు ఉచిత రవాణా భోజన సదుపాయాలతో వారిని పంపించడం జరిగింది ఇట్టి కార్యక్రమం కార్యక్రమంలో గంభీరావుపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు నేవూరి కమలాకర్‌రెడ్డి, సెక్రటరీ నరసింహరాజు, కోశాధికారి గొల్లపల్లి నాగరాజు మరియు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

చందుర్తి, ఆగస్టు 23: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని వక్తలు అన్నారు. శుక్రవారం చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో నూతన ప్రిన్సిపాల్ దేవరాజంతో పాటు బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ మల్లేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయలను నెరవేర్చాలని, బాధ్యతగా చదవాలని సూచించారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి, ఆగస్టు 23: అర్హులైన ప్రతీ ఒక్కరికి అంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని బోయినపల్లి మండలం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రెండు లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ చొప్పదండి నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఉదారి నరసింహచారి, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడపల్లి పరశురాములు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అమ్మిరి శెట్టి గంగయ్య, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షులు సుంకపాక ప్రభు, బిజెపి మండల కార్యదర్శి బొట్టుకు తిరుపతి, బీజేవైఎం మండల ఉపాధ్యక్షులు కళ్యాణ్, అనీల్ కుమార్, బూత్ అధ్యక్షులు బోయిని ప్రసాద్, గైశెట్టి ప్రశాంత్, సూదుల సాయి, రజనీకాంత్ పాల్గొన్నారు

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రుద్రంగి (చందుర్తి) ఆగస్టు 23: వాట్సాప్ గ్రూప్‌లో ఓ రాజకీయ పార్టీని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన గంగం మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు రుద్రంగి ఎస్సై అశోక్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మహేష్ అనే వ్యక్తి వాట్సాప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేశాడని రుద్రంగి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. సోషల్ మీడియా నందు ఎవరైనా మెసేజ్‌లు, వీడియోలు, ఫోటోలు ఇతరులను ఉద్దేశించి అవమానించే విధంగా, కానీ రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టించే విధంగా, కానీ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా మెసేజ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై డ్రామాలు

- అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేసే బాధ్యత మాదే
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చందుర్తి, ఆగస్టు 23: రాజకీయ లబ్ధి కోసమే రుణమాఫీపై ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చందుర్తి మండలం మల్యాల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొన్నటి వరకు అధికారంలో ఉండి రైతు సమస్యలను ఏ మాత్రమూ పట్టించుకోని వారు నేడు రోడ్లు మీద ధర్నాల పేరిట డ్రామాలు ఆడుతున్నారని, రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని అన్నారు. దేశచరిత్రలోనే ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేశామన్నారు. రైతుల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చాక రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేశారన్నారు. కేవలం 27 రోజుల్లోనే 22.37 లక్షల మంది రైతుల కుటుంబాలకు రుణమాఫీ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో కొంతమేర రుణమాఫీ ఆగిందన్నారు. ఇందులో ఆధార్ కార్డు తప్పులు, బ్యాంకర్లు వివరాలు తప్పుగా పంపడం, రేషన్ కార్డ్ లేకుండా కుటుంబంలో సాంకేతిక లోపం, రుణాలు రీ షెడ్యూల్ చేయడం వంటి కారణాలతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసిందన్నారు. రుణమాఫీ కానీ వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆయా మండలాల వ్యవసాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు. అర్హులందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు న్యాయం చేయని బీఆర్ఎస్ నాయకులు ధర్నాల పేరుతో రోడ్లపై డ్రామాలు ఆడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీ చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేస్తున్నారన్నారు. కొంతమంది రైతులు రెండు లక్షలపైన తీసుకున్నారని, వారికి కూడా రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో నాయకులు నాగం కుమార్, చింతపంటి రామస్వామి, భీమారాజు కనకరాజు, మ్యాకల గణేష్, గొట్టె ప్రభాకర్, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, దొంగరి భూమయ్య, మల్లారపు రాజయ్య, అవారి రమేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: బీఆర్ఎస్ నాయకులు రైతుల రుణమాఫీపై అవాకులు చెవాకులు మానుకోవాలని టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ ప్రక్రియను దశలవారిగా చిత్తశుద్ధితో చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ రైతులను పక్కదారి పట్టించేందుకు రోడ్లు ఎక్కి ధర్నాలు, నిరసనల పేరుతో యత్నిస్తుందని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, నాయకులు వైద్య శివప్రసాద్, నాయకులు పిట్టల శ్రీకాంత్, దేవరాజ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ అనవసర రాద్ధాంతం చేస్తూ రుణమాఫీపై నాటకం ఆడుతోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీ నివాస్‌రెడ్డి, సాహెబ్, రాంరెడ్డి, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, దేవయ్య, శ్రీకాం త్‌రెడ్డి, గంగయ్య, రాములు, రాజునాయక్, రాజేందర్, కిషన్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: పార్టీ ఉనికి కోసమే బీఆర్ఎస్ నాయకులు ధర్నా డ్రామా ఆడుతున్నారని గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ విమర్శించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో శుక్రవారం విలేకరుల సమావేశంలో హమీద్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వము ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అనవసరమైన ఆందోళనలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా కార్యదర్శి రామచంద్రం, సోషల్ మీడియా ఇన్చార్జి గౌరీ శంకర్, మాజీ ఎంపీటీసీ పరుశరాములు, నాయకులు ప్రభాకర్, ఎర్ర నరసయ్య, కిషన్ గౌడ్, బాలయ్య, విఠల్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: బీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా వీర్లపల్లిలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నింటీని నెరువేస్తోందన్నారు. దీనిని ఓర్చుకోలేక స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ధర్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాములు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, దినకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు చంద్రమౌళి, రాకేష్ గౌడ్, పర్లపల్లి దేవయ్య, నాయకులు శ్రీనివాస్, రవి, జలంధర్, కన్న దేవరాజు, రవీందర్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

కోనరావుపేట, ఆగస్టు 23: విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అన్నారు. మండలంలోని మర్తనపేట ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, కేజీబీవీ, ఈఎంఆర్ఎస్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థినులతో ముచ్చటించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీవిద్యార్థి విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య కేంద్రం అమలు తీరును పరిశీలించారు. పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, బరువు తక్కువ, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు అందజేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలని అదనపు కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

● **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..**

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల ఏకలవ్య గురుకుల పాఠశాలలో కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టులను అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని వైద్య బృందానికి ఆదేశించారు. కార్యక్రమంలో ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్‌బిఎస్‌కె డాక్టర్ నైమా, కృష్ణవేణి, సూపర్వైజర్ మెరిసి అరుణ్, చందు, జ్యోతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సత్కారం

ఇల్లంతకుంట, ఆగస్టు 23: మండలంలోని పొత్తూర్ క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారిగా పనిచేసి బదిలీపై వెలుతున్న దొడ్ల లతాశ్రీని రైతులు సత్కరించారు. రైతువేదికలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రైతులు మాట్లాడుతూ లతాశ్రీ నిరంతరం రైతులకు వ్యవసాయ సూచనలు, సలహాలు అందించి, అత్యధిక పంటదిగుబడికి సహకరించిందని రైతులు పేర్కొన్నారు. ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 23: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొత్త పీఆర్సీని అమలు చేయాలని టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు, పెద్దలింగాపూర్, గాలిపెల్లి తదితర పాఠశాలలో సభ్యత్వాలను శనివారం సేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులకు 010 పద్దుద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. కస్తూరిబా పాఠశాల ఉపాధ్యాయులను రెగ్యూలర్ చేయాలని, ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్రఅసోసియేట్ అధ్యక్షుడు రెంటాల రమణారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు పచ్చిమట్ల అనీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెల్ది కుమారస్వామి, జిల్లా కౌన్సిలర్ కటకం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రభుత్వ విప్

వేములవాడ టౌన్, ఆగస్టు 23: వేములవాడ మండలం చీర్లవంచలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దమ్మ ఆలయానికి చేరుకున్న ప్రభుత్వ విప్ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ విప్‌ను ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుక య్య, బోనాల రమేష్, వనపర్తి దేవరాజు ఉన్నారు.

గడ్డి మందు తాగి ఒకరి ఆత్మహత్యాయత్నం

వేములవాడ టౌన్, ఆగస్టు 23: వేములవాడ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన గడ్డి కొమురయ్య అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడాడు. శుక్రవారం తన ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందులు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పోలీసులను ఆశ్రయించిన ఆటోవాలాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 23: కారులోని టేపు రికార్డర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తే తామే చేశామని స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేసిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మిరియాల్‌కార్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆటోవాలాలు పోలీసులను ఆశ్రయించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతే తమపై నిందారోపణలు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెదలుకుంటూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే తమను దొంగలుగా చిత్రీకరించడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని వాపోయారు. కారులోని టైపు రికార్డర్ దొంగతనంపై సీసీ కెమెరాను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. తమపై ఆరోపణలు చేసిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని ఆటోవాలాలు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆటో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



ఇస్రో అక్షరాల ఆకృతిలో విద్యార్థులు



డ్రాయింగ్స్‌తో విద్యార్థులు

బోయిన్‌పల్లి, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బోయిన్‌పల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మాదిరెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇస్రో ఆకృతి ప్రదర్శించి, అంతరిక్ష రంగంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. చంద్రయాన్ పై పోస్టర్ రూపొందించారు.

ఈ సందర్భంగా మాదిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ చంద్రాయన్-3 విజయవంతంగా చంద్రుడిపై పూర్తయిన రోజును పురస్కరించుకొని భారత ప్రభుత్వం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం గా ప్రకటించిందని ఆయన తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. అనంతరం విజేతలకు బహుమతులను ఉపాధ్యాయ బృందం అందజేశారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

వీర్నపల్లి: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల గర్జనపల్లి విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రుడిపై పరిశోధనలకు గాను చేసిన చంద్రయాన్ యాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. చంద్రుడిపై పరిశోధనలు చేసిన దేశాలైన అమెరికా, చైనా, రష్యా లాంటి దేశాల తర్వాత నాలుగో దేశంగా భారత్ నిలిచిం దని అన్నారు. విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం లాంటి శాస్త్రవేత్తలను స్ఫూర్తి గా తీసుకొని విద్యార్థులు చిన్నప్పటి నుంచి శాస్త్రీయ ఆలోచనలను ఆవిష్కరించే విధంగా చదవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రేమ సాగర్, మంజుల, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న దాడులు అరికట్టాలి

ముస్తాబాద్, ఆగస్టు 23: దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, ఇటీవల ట్రైని డాక్టర్ మౌమితపై అత్యాచారం, హత్య చేయడాన్ని నిరసిస్తూ ముస్తాబాద్ మండల కేంద్రంలో మహర్షి స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మహిళల పట్ల జరుగుతున్న దాడులను అరికట్టి చట్టాలను అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్రైనీ డాక్టర్‌కు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధా, శ్రీకాంత్, మల్లారపు ఉత్పలమాల రవీందర్‌రెడ్డి, మోహన్, చర్ల శ్రీను, స్రవంతి, శిరీష, అనూష, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట, ఆగస్టు 23: కోనరావుపేట మండలం సుద్దాల అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉద్యానవ శంకర్, ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, కోశాధికారి డి రాజయ్య, కార్యవర్గ సభ్యులుగా డి దేవయ్య, రాజయ్య, సంజీవ్, ధర్మేందర్, స్వామి, దాసులు ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల చేయూత

కోనరావుపేట, ఆగస్టు 23: విద్యా బుద్ధులను నేర్పిన ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థులు శుక్రవారం చేయూతనందించారు. మండలంలోని కనగర్తి ప్రభుత్వ పాఠశాలలో 1996-97 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు రూ. 50 వేల విలువ గల కంప్యూటర్ ప్రింటర్, స్కానర్, యూపీఎస్‌లను అందజేశారు. ఈ సామగ్రిని హెచ్ఎం వినోద్ కుమార్‌కు అందజేసి తమ వంతు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేదారేశ్వర్

కోనరావుపేట, ఆగస్టు 23: కోనరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేదారేశ్వర్ బాధ్యతలు చేపట్టారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ప్రిన్సిపాల్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు.

పేదలకు విద్యను దూరం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

- కార్మిక భవనంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



మాట్లాడుతున్న అంగూరి రంజిత్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23: దేశంలోని పేద విద్యార్థులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను దూరం చేస్తోందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అంగూరి రంజిత్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం 2020ని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. విద్యార్థి సంఘాల నాయకులు ఐక్యతను చాటుతూ చేయిచేయి కలిపి అభివాదం చేశారు. ఈ సందర్భంగా రంజిత్, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020 బిల్లును పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకండా మెజార్టీ ఉందని బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింప జేసుకుందని ఆరోపించారు. ఈ బిల్లులో ప్రైవేటు కార్పోరేట్, పెట్టుబడిదారులకు ఉపయోగపడే అవకాశాలను పొందపరచడం దుర్మార్గం అన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ యూనివ ర్సిటీలను, విదేశీ వస్తులకు అనుమతించడం ఫీజుల నియంత్రణ లేకపోవడం వంటి అంశాలు ఉన్నాయని వాపోయారు. దేశంలోని పేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లు అమలుతో దేశంలో తీవ్రంగా అసమానతలు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కామన్ విద్యా విధానానికి ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలు విద్యా సంస్థలకు నిధులను కేటాయించడకుండా ప్రభుత్వ విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్, ప్రైవేటు యూనివర్సిటీలకు పెద్ద పీట వేస్తూ ప్రధానమంత్రి మోది పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 బిల్లును రద్దు చేసి దేశంలోని పేద విద్యార్థులందరికీ ఉచిత నాణ్యమైన విద్యను అందించి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ యూత్ నాయకులు గుడిసె ప్రభాకర్, భీమార్మి నాయకులు దొబ్బల ప్రవీణ, బహుజన విద్యార్థి సేన నాయకులు జింక శ్రీధర్, జింక రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, అక్షయ్, అభిలాష్, మనీష్, నిరీక్షణ, మనోహర్, దినేష్, అంజయ్, యశ్వంత్, ఆదిత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.